# కట్నంలేని పెళ్లి

శ్రీమతి మల్లవరపు విజయలక్ష్మిగారు

మా అమ్మకు ముగ్గురమే ఆడ పిల్లలము. నేను అందరి కంటే చిన్న దాన్ని. మా పెద్దక్కయ్యను నాలుగువేలు కట్నమిచ్చి వేములవాడ కరణంగారి పెద్ద కుమారున కిచ్చి వివాహం చేశారు మా నాన్నగారు. మా బావ అప్పటికి బి. యే. పూర్తిచేసి ప్లీడరీ పరీక్షకు చదువుతున్నాడు. మా మా అక్కయ్య అత్తగారు రాక్షసావతారమని ఆ చుట్టు పక్కల గ్రామాదులలో పేరు పొందింది. మా బావ చదువు పూర్తి కాకుండానే ఆవేసవిలో మా అక్కయ్యను అత్తారింటికి పంపించెయ్యమని గొడవ మొదలెట్టింది. 'ఇప్పుడేమి తొందర, మీ అబ్బాయి చదువు పూర్తి కానియ్య'మంటే వీల్లేదంది. పైగా తన యిష్టాను సారం కోడలిని పంపించక పోతే కొడుక్కి మళ్లీ పెళ్లి చేసేస్తానందికూడాను. కరణం గారు మాత్రము భార్యాగారికి ఎదురు చెప్పలేరు. ఆమె చేసే పనికి 'తథాస్తు' అనడమే ఆయన పని. అప్పటికే మా అక్కయ్య మెట్రిక్యులేషన్ చదువుచున్నది. మా నాన్న గారు మరీ పట్టుదల మనిషి. 'పోనీ ఆడపిల్లలు గలవాళ్లము, కొంచెం తగ్గితే మునిగిపోయినదేమిటి ఎప్పటికైనా వాళ్లపిల్లని వాళ్లింటికి పంపించాలిసిందే కదా! పోనీ వాళ్లిష్టానుసారమే, పంపితే తీరిపోతుంది, ఎందుకొచ్చిన పట్టుదలలు, అని మా అమ్మ మా నాన్నగారి చెవిని ఇల్లుకట్టుకొని పోరింది. 'ఏడి శావులే, నోరు మూసుకో, నీకేం తెలుసు, నాకా నీవు చెప్పొచ్చేది.' అని మా నాన్న కొండ బద్దలయ్యేలాగ గావు కేకలు పెట్టేడు. మా అమ్మ హడిలిపోయి కిక్కురు మన కుండా వూరుకుంది. మా బావ చేతకూడా మా నాన్నగారిని అడిగించారు. మాటికి ముమ్మాటికి మా అక్కయ్యను వాళ్ల యిష్టంవచ్చినప్పుడు అత్తారింటికి పంపించేదిలేదని మా నాన్న గారు ఖండితంగా చెప్పేశారు.

చూస్తూవుండగానే మా బావకు మళ్లీ పెళ్లీ అవనే అయింది నాలుగువేల కట్నంతో. ఇంక మా అక్కయ్య చదువు పూర్తి చెయ్యడం తప్పని సరి అయిపోయింది. పాపం, దాని మనస్సులో ఎట్లావుండేదో ఎవరికి చెప్పేది కాదు. నేను ఫోర్తుఫారంలోకి వచ్చేసరికి దాని బి. యే. అయిపోయింది. అప్పటికే మా బావకు నలుగురు పిల్లలు కూడా పుట్టేశారు.

మా చిన్నక్క ఈ బాధ ఏమీ లేకుండానే పెండ్లి కాకుండా మమ్మలవదలి వెళ్లిపోయింది పరలోకానికి. ఇక నేను మిగిలేను మా తల్లిదండ్రులకు పెండ్లి చేసేందుకు. నేను మెట్రిక్యులేషన్ పూర్తి చేశాను. పరీక్షా ఫలితాలు తెలిసినది మొదలు మా అమ్మ నాన్నగార్లకు ప్రతి రోజు యుద్ధమే నా పెండ్లి విషయమై. అమ్మేమో 'త్వరగా చూడండి ఏదైనా మంచి సంబంధం, మీరు ఆ విధంగా తాత్సారము చేస్తే పిల్ల పెంగ్గొట్లా అవుతుంది. అదేమో చెట్టల్లే పెరిగిపోతోంది. ఏమోనబ్బా, దాని విషయమై తలుచుకున్నప్పుడల్లా నాకు నిద్రకూడా పట్టడములేదు!' అనేది అమ్మ. నాన్నేమో 'ఇట్లా నీ గోల పడలేకనే పెద్ద దాన్ని తొందరపడి ఆ రాక్షస పీనుక్కి అంటకట్టేను. దీన్ని కూడా అల్లాగే చెయ్యమనా నీ వుద్దేశ్యము? నేనైతే ఇంక పెండ్లి సంబంధం కోసం తిరగను. సంబంధం ఏదైనావచ్చినా కట్నం దమ్మిడీకూడా ఇవ్వను? అయితే అవుతుంది కాక పోతే కాకపోతుంది. వీళ్లే నా కొడుకులనుకుంటాను. ఇక మీద నీవు ఈ విషయమై ఆట్టే మాట్లాడేవంటే చూసుకో జాగ్రత్త' అని కేక లెట్టేవారు.

నా చిన్నప్పటినుండి ఈ పెండ్లి విషయమై వినడంవల్లను, తర్వాత మా అక్కయ్యకు జరిగిన సంఘటనవల్లను నాకు పెళ్లి మాటెత్తితే వళ్లుమండు కొచ్చేది. అనలు మా నాన్న ఇంకా ఎవరైనా అన్నయ్యలు తప్ప మిగిలిన మొగవాళ్లంటే చెప్పలేనంత కోపంగావుండేది. 'స్త్రీలకు పురుషులు చెప్ప నంత అన్యాయం జేస్తున్నారు. న్యాయ చట్టముకూడా వాళ్లనే సమర్థిస్తుందాయెను. సృష్టిలో స్త్రీ పురుషులు సమాన భాగస్వాములు కాదా! ఎందుకో ఇంత అన్యాయము." అని నేను ఒంటిగా కూర్చునప్పుడల్లా ఆలోచిస్తూ వుండేదాన్ని.

# కట్నంలేని పెళ్లి

సరే శలవలు అయిపోగానే మా నాన్నగారు నన్ను కాలేజీలో యఫ్. యే. లో చేర్పించారు. నేను పట్టుదలగా చదివేదాన్ని. అన్ని సబ్జక్టులలోను మొదటి మార్కు నే తెచ్చుకునే దాన్ని. నా క్లాసు మొగ పిల్లలందరు నాతో పరిచయము చేసుకుందుకు వుబలాట పడేవారు. కాని వారికి అటువంటి అవకాశము ఇవ్వకుండా వుండేదాన్ని. ఇట్లావుండగా ఒక రోజుని మా క్లాసు మా నేటరగు పరశురామశర్మ నా దగ్గరికివచ్చి 'ఏమండీ మీరు ఇవ్వేళ మీటింగ్ లో మాట్లాడాలి, మాట్లాడవలసిన విషయము 'స్త్రీ విద్య' అని చెప్పేడు. ఫస్టు మార్కు తెచ్చుకుందుకు ప్రతి పరీక్షలోను ఈ అబ్బాయి నాతో పోటీపడుతుంటాడు. ఒక మార్కో రెండు మార్కులో తేడాగా నాకే వచ్చేది. ఫస్టుమార్కు.. 'మీరుకూడా మాట్లాడు తున్నారా' అన్నాను, అవునండీ మాట్లాడుతాను అన్నాడు. ఆలోచించకుండా నే నా అంగీకారమునుకూడా తెలిపేను. చాలామంది ఆ మీటింగ్ లో మాట్లాడేరు. కొందరు స్త్రీకి విద్య అనవసరమని, మరి కొందరు అవసరమని వివిధ రీతులుగా మాట్లాడేరు. మా నేటరు పరశురామశర్మ ఇట్లా మాట్లాడేడు "స్త్రీకి విద్య చాలా అనవసరము. ఎందు కంటే స్త్రీ బాగా చదువుకున్నట్లైతే, ఇతర ముఖ్యమైన పనులన్నీ మానేసి అస్తమానము నవలలు నాటకాలు చదువుతూ కూర్చుంటుంది. తన కాలమంతా వ్యర్థమగు నవలలు చదవడముతో నే వినియోగిస్తుంది. ఈ పాడు చదువు లేకపోతే ఎంతైనా మంచివన్నీ నేర్చుకుని సంసారాన్ని దిద్దుకొనుచు పొదుపుగా భయభక్తులతో అణగి మణగివుంటుంది. ఈ విద్యవలననే చాలామంది స్త్రీలు చాలామటుకు పాడైపోతున్నారు' అని ఇంకా ఇల్లాటిదే ఏదో గొణిగాడు. అతడు మాట్లాడిన దానిలో ముఖ్యముగా నేను గ్రహించినది ఈ వక్కటే. తరువాత నేను మాట్లాడవలసివచ్చినది. ఏం మాట్లాడను. అతను మాట్లాడినది వినే సరికి నాకు వళ్లు భలే మండింది. చదువుకున్న ఆడవాళ్లను గురించి ఆ విధంగా మాట్లాడడం నాకేమీ నచ్చలేదు. నవలలు చదువుకున్న స్త్రీలు చదువుకుంటూ ఇంట్లోనే వుంటారు. చదువుకోని స్త్రీలు ఇరుగు పొరుగు వారితో మాటలతో కాలక్షేపం చేస్తూ అనవసరమైన ఘర్షణలు తెచ్చుకుంటూవుంటారు. అసలు మనిషి అన్నాక ఏదో విధంగా కాలక్షేపము చేయాలి కదా! చదువుకున్నట్లైతే ప్రపంచ పరిస్థితి ఏరోజుకారోజు తెలుసుకుంటూ, ఏవైనా కష్టాలు తనకి సంభవిస్తే తనఒక్కర్తికే కాదనియు, తనకంటే ఎక్కువ కష్టపడే స్త్రీలు ఈ ప్రపంచములో నున్నారనియు తెలుసుకొని తనకష్టములను సంతోషపూర్వకముగా భరిస్తుంది. స్త్రీకే విద్య లేకపోతే, స్వతంత్రశక్తి లేనిదై ఇతరులమీద పూర్తిగా ఆధారపడవలసి వస్తుంది. ఏకారణమువలనగాని వారు తన భారమును మోయుట కంగీకరించనిచో, తాను ఏ నుయ్యో, గొయ్యో చూచుకుని తన భారాన్ని ఇతరులమీద లేకుండా చేస్తుంది. ఉదాహరణకు ఆడ పిల్ల పెండ్లి విషయమై చూడండి— తల్లిదండ్రులు ఏ విధముగా తహ తహలాడు తారో! కొన్ని వేలు కట్నము ఇస్తే తప్ప మంచి సంబంధము దొరుకదు. దొరికి నప్పటికీ వారు చెప్పిన షరతులన్నిటీ వప్పుకొని ఎంతో భయపడుతూ వుంటారు. ఏ విషయములో చూచినా స్త్రీకి అన్యాయమే జరుగుతూవున్నది. అవసరమైనప్పుడు తన విద్య నుపయోగించి స్వతంత్ర శక్తివలన జీవించగలిగే సామర్థ్యము స్త్రీకి తప్పకవుండవలయు'నని నా వుపన్యాసాన్ని ముగించేను. ఆ వేళ వినిన అతని వుపన్యాసమువలన తప్ప పరశురామశర్మకు అటువంటి వుద్దేశాలు స్త్రీ విద్యపై వున్నట్లునాకు తెలియనే తెలియదు. నేను యఫ్. యే. పాస్ అయినాను. పరశురామశర్మ కూడా పాస్ అయినాడు. మళ్లీ బి.యే. లోకూడా ఇద్దరం క్లాసు మేట్సుమే అయినాము. అప్పుడప్పుడతను ఎందుకో ఒకందుకు పుస్తకమనో లేక నోట్సు అనో వంకెట్టుకుని నన్ను అస్తమానం పలకరిస్తూవుండేవాడు. నేను అంత చనువుగా మాట్లాడే దాన్ని కాదు. ఏదో ముక్తసరిగా సమాధానం చెప్పివూరుకునేదాన్ని.

నేను బి.ఏ. పూర్తి చేశాను. తర్వాత ఏమి చేయట మా అన్న సమస్యవచ్చినది. 'ఇక లాభంలేదు దాని పెండ్లి విషయమై ఆలోచించుట.' అని మా అమ్మకూడా మొండికెత్తి ఆ విషయమే మాట్లాడం మా నేసింది. మా అక్కయ్య వుపాధ్యాయినిగా వున్నది కనుక నేనుకూడా ఆ పనే ఎందుకనుకున్నాను. తర్వాత మానాన్నా గారి స్నేహితులు కొందరు ప్లీడరీ పరిక్షకు వెడితే బాగుంటుందన్నారు.

# కట్నం లేని పెళ్లి

సరే మా నాన్నగారి అంగీకారంమీద 'లా' చదివేందుకు చెన్నపట్నం వెళ్లేను. నేను హాస్టలులో వున్నాను. 'పరశురామ శర్మ యం. యే. చదివేందుకు మద్రాసు వచ్చినట్లు మా నాన్నగారు రాశారు. ఈ పరశురామ శర్మ నేను ఎక్కడికి వెడితే అక్కడికే తయారవుతున్నా డేమిటి బాబు! అయినా మా నాన్నగారు అతని సంగతెందుకూ ప్రత్యేకించి నా వుత్తరములో రాశారు? అని ఒక రోజంతా ఆలోచించాను. తర్వాత నా చదువులోపడి పోయాను. ఒక రోజు హటాత్తుగా నా కోసమెవరో విజిటరువచ్చి విజిటింగ్ రూములో కూచున్నట్లు నాకు కబురువచ్చింది. ఆడావుడిగా ఎవరా అని వెళ్లేను—పరశురామ శర్మ. "హి-హి-హి కులాసాగావున్నారండీ" అని పల్కరించాడు. నా కులాసాకేమి? బాగానేవున్నా. మీ రిలావచ్చారేమిటి అన్నాను.

'ఏమీ లేదండి. మిమ్మల చూచి చాలా రోజులైంది చూచి పోదామని వచ్చాను. మీతో కొన్ని విషయాలు మాట్లాడుదామనికూడా వచ్చాను. మీకు ఇప్పుడు వీలుంటుందా' అన్నాడు.

నేను ముభావంగా, ఏ విషయాలండీ అన్నాను. దానితో చెప్ప నారంభించాడు. 'నాకు ఒక్కర్తే ఒక చెల్లెలున్నది. దాని వివాహము చేసి మా నాన్నగారు చనిపోయారు. వరుడు బియే. చదువుతూ చనిపోయాడు. మా చెల్లెలి భవిష్యత్తును తలుచుకుంటే నా కేమీ తోచుట లేదు. చదివించుదా మా అనుకుంటున్నాను, దానికి మా అమ్మ అంగీకరించుట లేదు. మా అమ్మగారి యిష్టానుసారం దాన్ని అల్లాగే వుంచెయ్యడమా లేక మా అమ్మగారికి అయిష్టమైనా సరే మా చెల్లిని చదివించడమా అని ఆలోచిస్తున్నాను. ఈ విషయములో మీ అభిప్రాయము కూడా తెలుసుకుందా మని వున్నది." అని అన్నాడు. స్వానుభవము కలిగేదాక మనుష్యులు మారరుకదా! అనుకున్నాను. "స్త్రీ విద్యనుగురించి మీకు విచిత్రమైన భావాలున్నాయనుకుంటానే, 'స్త్రీ చదువుకుంటే పాడైపోదా! అని అన్నాను. దానికి శర్మ మొదట తెల్లపోయి తర్వాత స్ఫురణకు తెచ్చుకుని, 'ఓహో, ఎప్పుడో నేను డిబేట్లో స్త్రీ విద్యనుగురించి మాట్లాడినది మీరింకా జ్ఞాపకముంచుకున్నారా! ఇప్పటి నాయభిప్రాయం స్త్రీకి తప్పక విద్యవుండాలనే. స్త్రీకి కూడా పురుషుని వలె ఆర్థిక స్వాతంత్ర్యంవుండి తీరాలి లేక పోతే ఆ జన్మాంతం ఇంకొకరిపైన ఆధారపడి, తనవ్యక్తిత్వమును కోల్పోతుంది. ఆ విధంగాలొంగి పోవుట కిష్టములేని వ్యక్తి కష్టపడుతుంది, లేదా ఆత్మహత్యకు ప్రయత్నిస్తుంది." అన్నాడు.

నాకొంతవరకు శర్మ మాట్లాడినది సమంజసముగానే కనిపించినది. తనకు స్వానుభవమేదో కలిగివుండుట వలన ఈ విధంగా మారేడనుకున్నాను. 'సరే! మీ అభిప్రాయాలు నా అభిప్రాయాలు ఏకీభవించాయి. తప్పకుండా మీ చెల్లెలిని ప్రైవేటుగా బెనారెస్ మెట్రిక్‌కు పంపండి. త్వరగా అయిపోతుంది. సులభంకూడాను. అదైన తర్వాత ఆలోచిద్దా' మన్నాను.

ప్రతి శని ఆదివారాలలోను శర్మ మా హాస్టలుకు వస్తూవుండేవాడు. మొదట అతనిరాక అట్టేనాకు ఇష్టముండేది కాదు. గాని తర్వాత తర్వాత అతను రావడము మా మూలు అయి పోయినది. వచ్చినప్పుడల్లా అతను నేను కలిసి అనేక విషయాలపై వాదోపవాదాలు చేసుకుంటూవుండే వాళ్లం. శర్మని మా హాస్టలులో చాలామంది నా స్నేహితురాండ్రకు పరిచయముకూడా చేశాను. అప్పుడప్పుడు మేమంతాకలిసి బీచికికూడా వెడుతూవుండేవాళ్లము.

చూస్తుండగానే రెండేళ్లుగడిచి పోయాయి. నేను యఫ్.యల్. బి.యల్. కూడా పూర్తి చేశాను. శెలవలకు ఇంటికి వెళ్లేను. 'చదువంతా పూర్తియింది ఇంకనేమి చేయదలచుకున్నావు తల్లీ!' అని మానాన్నగారు అడిగేరు. చదువు పూర్తయాక అంతా ఏమి చేస్తారో నేనూ అదే చేస్తా. అన్నాను. అయితే మద్రాసులో ప్రాక్టీసు పెట్టావమ్మా అన్నారు నాన్ననవ్వుతూ. 'ఇక చాలెండి నవ్విపోతారెవరైనా వింటే ఆడు పిల్లేమిటి ప్లీడరీ చెయ్యడమేమిటి; దానికింక పెళ్లి పేరంటం అవసరము లేదాయేమిటి! అన్నది అమ్మ. 'అవసరము లేదని నేనటుకు అన్నానా, వరుడు సిద్ధంగానే వున్నాడు. వేరే వెతకనవసరములేదు, నా పట్టుదల ప్రకారం నేను దమ్మిడీ కట్నం

కూడా ఇవ్వనవసరము లేదు. అన్నారు నాన్న నాకేసి చూస్తూ, నవ్వుతూ! నాన్న మాటలు నాకేమీ బోధపడ లేదు. అంత సిద్ధంగా వున్నవరుడెవరా అనుకున్నాను.

మర్నాడు మధ్యాహ్నం భోజనాలయాక నాన్న ఒక చిన్న వుత్తరాల కట్ట ఒకటి తెచ్చినాముందు పడేసి చదవ మన్నారు. ఆదస్తూరిచూస్తే శర్మదిలాగ కనిపించింది. ఇదేమిటా అని ఆశ్చర్య పోతూవిప్పేనుకట్ట. ఒక్కొక్కటి చదువుతుంటేనాకు కోపము ఆశ్చర్యము కలిగేయి - ఆఖరి వుత్తరములోని సారాంశమేమిటంటే శర్మనన్ను వివాహము చేసుకుందుకు తనకేలాటి అభ్యంతరమూ లేదనియు, నా అంగీకారమును కూడా తెలుసుకుని వ్రాయమనియు వున్నది. 'నాన్నా శర్మ ఈ విధంగా వ్రాయుటకు కారణమేమి? నీవే ముందు ఏదో అతనికి వ్రాసివుంటావు. నా యిష్టమును తెలుసుకోకుండా ఎందుకు అల్లారాశావు?' అన్నాను. అయితే సరే ఇప్పుడతనికీ ఏమని రాయ మన్నావు. యస్ అని రాయమన్నావా, నో, అని రాయమన్నావా? అన్నారు నాన్న. నేను ఏమీ చెప్పలేక పూరుకున్నా. మౌనం అర్ధాంగీకారం కనుక అతనికి ఇప్పుడే నీ అంగీకారము తెల్పుతూ రాస్తున్నానమ్మా అన్నారు. ఆ శెలవలలో మా వివాహామైనది.

నేను ప్రాక్టీసు పెట్టేను. శర్మకు ప్రసిడెన్సీకాలేజీలో లెక్చెరరు పని అయింది. నాన్నమమ్మల చూచి సంతోషిస్తూవుంటారు. అమ్మకూడా కట్నం లేని పెండ్లే బాగున్నది. అంటుంది. అక్కయ్య మాత్రం వుద్యోగరీత్యా ఆ వూరు ఆ వూరు తిరుగుతూవున్నది. నా వివాహం తలుచుకుని ఇప్పటికీ నేను ఆశ్చర్య పడుతుంటాను.


# నర్సరీస్కూలు ఉపాధ్యాయుల తర్ఫీదులకు

## బృందావన ట్రయినింగ్ పాఠశాల

బాలోద్యానవన పాఠశాల మైలాపూర్, మదరాసు.

ఇందు సెకండరీ శాఖలో స్కూలుఫైనలు పాస్ అయినవారును ప్రాథమిక శాఖలో, మూడవఫారమ్‌గాని, ఎనిమిదవ తరగతిగాని పాస్ అయినవారును జేర్చుకొనబడుదురు. ఇందుకూడా సాధారణ ఉపాధ్యాయ ట్రయినింగ్ ముగించినవారికి ఈ తర్ఫీదు ఒక సంత్సరము. తదితరులకు రెండు సంవత్సరములు ఏర్పాటు చేయబడినది. తర్ఫీదనంతరము వీరు గవర్నమెంటు పరీక్షకు పంపబడుదురు.

బోధన తెలుగులో, అరవములోనూ జరుగును. తెలుగు యువతులకు ఉచిత వేతనములు ఏర్పాటుచేయబడును.

ఈ సదవకాశమును పురస్కరించుకోదలచిన ఆంధ్ర యువతులు, వివరములకు ఈ క్రింది చిరునామాకు వ్రాయవలెను.

డాక్టర్. వి. ఎన్. శర్మ
ప్రిన్సిపాల్
బాలోద్యానవనము, ఎడ్వర్డ్ ఎలియట్సు రోడ్డు, మైలాపూర్.